సాక్షి
నిజామాబాద్
బుధవారం । 21 । జూన్ । 2023



ఘనంగా జగన్నాథ రథయాత్ర

జిల్లా కేంద్రంలో మంగళవారం ఇస్కాన్ ఆధ్వర్యంలో పూరి జగన్నాథ రథయాత్రను నిర్వహించారు.

- 8లో ▸



చుక్క నీరు ఇవ్వని ప్రభుత్వం

తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు చుక్క నీరు ఇవ్వలేదని రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి ఆరోపించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.9 /29.5

వాతావరణం

ఉదయం నుంచే ఎండ వేడిమి అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఆకాశం నిర్మలంగా మారుతుంది.

న్యూస్‌రీల్

లిఫ్ట్‌లో ఇరుక్కున్న బోధన్ ఎమ్మెల్యే

నిజామాబాద్ సిటీ : బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ 20 నిముషాల పాటు లిఫ్ట్‌లో ఇరుక్కున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో ఈ ఘటన చోటు చేసుకుంది. నగరంలోని ప్రగతినగర్‌లో గల ఓ ప్రయివేట్ ఆస్పత్రి నాల్గవ అంతస్తులో బోధన్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త చికిత్స పొందుతున్నాడు. పరామర్శించేందుకు సోమవారం రాత్రి ఎమ్మెల్యే షకీల్ సుమారు 15 మంది అనుచరులతో కలిసి ఆస్పత్రికి వచ్చారు. అందరూ లిఫ్ట్ ఎక్కారు. ఓవర్‌లోడ్ అవుతుందని అక్కడి సిబ్బంది అభ్యంతరం తెలిపినా పట్టించుకోలేదు. లిఫ్ట్ నాల్గో అంతస్తుకు చేరుకోకముందే మధ్యలో ఆగిపోయింది. ఆందోళనకు గురై లిఫ్ట్‌లో ఉన్న వారు కేకలు పెడుతూ లిఫ్ట్ డోర్‌లను గట్టిగా బాదారు. అప్రమత్తమైన ఆస్పత్రి సిబ్బంది లిఫ్ట్ సాంకేతిక సిబ్బందిని పిలిపించగా డోర్‌ను తెరిచారు.

జూలై 10నుంచి డిగ్రీ ప్రాక్టికల్స్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ వర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ కళాశాలల్లో డిగ్రీ 2వ, 4వ, 6వ సెమిస్టర్ రెగ్యులర్ ప్రాక్టికల్ పరీక్షలు జూలై 10నుంచి 25వరకు జరుగుతాయని కంట్రోలర్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.in ను సంప్రదించాలని ఆమె సూచించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: గురుకుల ఉపాధ్యాయుల పరీక్షకు సన్నద్ధమవుతున్న జిల్లాకు చెందిన బీసీ నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ కో–ఆర్డినేటర్ ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో 60శాతం పైన మార్కులు ఉన్న అర్హులైన బీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సుభాష్‌నగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

81 మంది విద్యార్థుల గైర్హాజరు

నిజామాబాద్‌అర్బన్: టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా జిల్లాలో మంగళవారం జరిగిన పరీక్షకు 81 మంది విద్యార్థులు గైర్హాజయ్యారు. 12 సెంటర్లలో 276 మంది విద్యార్థులకు గాను 195 మంది పరీక్ష రాశారు.

ఆరోగ్యయోగం

- నిత్యం యోగా చేయడంతో అనారోగ్య సమస్యలు దూరం
- ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తి
- నేడు ప్రపంచ యోగా దినోత్సవం





ఏక పాద రజకపోత్తానాసనం వేస్తున్న అక్షర

ఉరుకుల, పరుగుల జీవితం మానవాళి ఆరోగ్యానికి ముప్పుగా పరిణమిస్తోంది. అనేక ఒత్తిళ్లు, శారీరక శ్రమ తగ్గిపోవడంతో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. మానసికంగా కుంగిపోతున్నారు. అటువంటి వారి ఆరోగ్యానికి యోగానే మహాభాగ్యం వంటిదని యోగా గురువులు సూచిస్తున్నారు. నిత్యం దైనందిన జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందేందుకు యోగాసాధన ఎంతో ఉపయోగపడుతుంది. యోగా సాధనతో శారీరక, మానసిక ప్రశాంతతతోపాటు జీవనశైలిలో పరిపూర్ణమైన మార్పులు పొందుతున్నారు. ఇటీవల కాలంలో ప్రజల్లో యోగాకు ఆదరణ పెరుగుతోంది. నిత్యం యోగా చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు కృషి చేస్తున్నారు. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

నిజామాబాద్ సిటీ/ఆర్మూర్: మనుషులంతా యాంత్రిక జీవనానికి అలవాటుపడి శారీరక, మానసిక సమస్యలు, ఏకాగ్రత లోపంతో బాధపడుతున్న నేటి రోజుల్లో యోగా చేయడంతో సత్ఫలితాలు ఉంటాయని ప్రముఖ వైద్యులు సైతంసూచిస్తున్నారు. నిత్యం యోగా సాధన ద్వారా శారీరక ఎదుగుదలనే కాకుండా మానసిక ఎదుగుదల సైతం సాధ్యమవుతుందని పేర్కొంటున్నారు. నేటి తరం విద్యార్థులు టీవీలు, సినిమాలు, సెల్ ఫోన్‌ల కారణంగా ఏకాగ్రత కోల్పోయి నెగెటివ్ ఆలోచనల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కానీ యోగా సాధన ద్వారా విద్యార్థులు తమలోని నెగెటివ్ ఆలోచనలను వదిలి పాజిటివ్ ఆలోచనలతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని యోగా గురువులు పేర్కొంటున్నారు.



ఆర్మూర్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు

యోగా సాధనతో..

యోగా సాధనతో విద్యార్థులను అన్ని రంగాల్లో నిష్ణాతులను చేయవచ్చని ప్రయోగాత్మకంగా రుజువు చేస్తున్నారు జిల్లా కేంద్రానికి చెందిన యోగా శిక్షకురాలు సంగీత. ఈ శిక్షకురాలి పర్యవేక్షణలో యోగా పోటీల్లో విద్యార్థులు చేస్తున్న ప్రదర్శన చూపరులను అబ్బుర పరుస్తున్నాయి. చక్రాసన్, భూమాసన్, వ్యాఘ్రాసన్, చక్ర దండాసన్, ఉత్తిత తితిభాసన్, ఓంకారాసన్, వ్యాఘ్ర వృశ్చికాసన్, శలభాసన్, గండబేరుండాసన్, నికరాసన్, వృశ్చికాసన్ తదితర ఆసనాలను చిన్నారులు ప్రదర్శించి వీక్షకులను అలరిస్తున్నారు. అంతే కాకుండా జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులు జిల్లాలో ఎందరో ఉన్నారు.

నిత్యం యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



నిత్యం యోగా చేసే ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. ప్రధాని మోదీ ప్రపంచ వ్యాప్తంగా ప్రజలను ఆరోగ్యవంతుల్ని చేయాలని, ఐక్యంగా ఉండాలని పాటుపడుతున్నారు. ఇప్పటివరకు 193 దేశాలలో యోగా విస్తరించింది. నిజామాబాద్‌లో తొమ్మిదేళ్లుగా నెహ్రూ యువకేంద్ర సౌజన్యంతో ప్రతి సంవత్సరం జూన్ 21న యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం. యోగా పోటీలు ఎక్కడ జరిగిన నిజామాబాద్ జిల్లా ప్రథమ స్థానంలో నిలుస్తుండడం సంతోషకరం. నేడు యోగా దినోత్సవాలు నగరంలోని ఆర్మూర్ రోడ్డులో గల శ్రీరామ గార్డెన్, న్యాల్‌కల్‌రోడ్డు చౌరస్తా మున్నూరుకాపు సంఘంలో, కసాబ్‌గల్లి ఆర్యసమాజంలో జరుగనున్నాయి.

– రాంచందర్, యోగా శిక్షకుడు, సుభాష్‌నగర్

ఆత్మ స్థైర్యం పెరుగుతుంది

యోగా సాధనతో ఎంతటి సమస్యనైనా ఎదుర్కొనే ఆత్మస్థైర్యం అలవడుతుంది. అదే ధైర్యంతో జీవితంలో ఎలాంటి కష్టాలనైనా సులభంగా ఎదుర్కొనే సత్తా పెరుగుతుంది. యోగాను ఇష్టపడి సాధన చేస్తే అటు చదువుతో పాటు అన్ని రంగాల్లో ఏకాగ్రత పెరుతుంది. విద్యార్థి దశ నుంచి యోగా సాధనతో విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుంది. యోగా సాధనతో వ్యాధులను సైతం నయం చేసుకోవడానికి ఆస్కారం ఉంది.

–సంగీత, యోగా శిక్షకురాలు, నిజామాబాద్



బద్ధ పద్మాసనం వేసిన అక్షర

పిట్ట కొంచెం.. ఆసనాలు ఘనం

మోపాల్: మోపాల్‌కు చెందిన అంగలి నవీన్ రెడ్డి, జ్యోతి కుమార్తె అక్షర. చిన్నారి వయస్సు ఆరేళ్లు. తరచూ అనారోగ్యంతో ఆస్పత్రుల చుట్టూ ఎక్కువగా తిరిగేది. కుమార్తెను చూసి తల్లిదండ్రులు బాధపడేవారు. సరిగ్గా నాలుగున్నరేళ్ల వచ్చేసరికి తండ్రి తనకు వచ్చిన ఆలోచనను ఆచరణలో పెట్టాడు. అక్షరతో నిత్యం యోగా సాధన, ధ్యానం చేయిస్తే ఫలితం ఉంటుందని భావించాడు. ఏడాదిన్నరగా ప్రతిరోజూ ఉదయాన్నే సాధన అలవాటు చేశాడు. దీంతో అనారోగ్య సమస్యలు దూరమయ్యాయి. ప్రస్తుతం అక్షర పూర్తి ఆరోగ్యంగా, ఎంతో చురుకుగా ఉంటోంది.

క్లిష్టమైన యోగాసనాలు..

అక్షర ఆరునెలలుగా ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తోంది. వంద రోజులు యోగాసనాలు చేసి సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టాలని ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు అక్షర మంగళవారం నాటికి వందరోజులు పూర్తి చేసింది. ఆరేళ్ల వయస్సులోనే యోగాలోనే క్లిష్టమైన ఆసనాలు చేస్తూ అబ్బురపరుస్తోంది. పశ్చిమోత్తాసనం, సుప్త వజ్రాసనం, హలాసనం, బద్ధ పద్మాసనం, సర్వాంగాసనం, ధనురాసనం, భుజంగాసనం, ఏకపాద రజక పోత్తానాసనం, ధ్యాన స్థితి, తదితర క్లిష్టమైన ఆసనాలను సునాయసంగా వేస్తోంది.

విద్యారంగంలో

దేశంలోనే మేటి

- సమూల మార్పులు తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- జెడ్పీ చైర్మన్ విఠల్ రావు, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న కార్యక్రమాల ద్వారా విద్యారంగంలో సమూలమైన మార్పులతో తెలంగాణ దేశంలోనే మేటిగా మారిందని వక్తలు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో విద్యా దినోత్సవం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, మేయర్ దండు నీతూ కిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ విఠల్ రావు, ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయంతో పాటు విద్య, వైద్య రంగాలకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో మన ఊరు – మన బడి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి రూ. కోట్లు వెచ్చిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్య ప్రాతిపదికగా తీసుకుని తొలివిడతలో జిల్లాలో 407 పాఠశాలల్లో మన ఊరు – మన బడి/ మన బస్తీ–మన బడి కింద సమగ్ర అభివృద్ధి కోసం రూ.150 కోట్లు ఖర్చు చేస్తోందని వివరించారు. మౌలిక సదుపాయాలతో పాటు, డిజిటల్ తరగతి గదులు, ఆంగ్ల మాధ్యమ బోధనతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సమగ్రంగా మార్చేశారని కొనియాడారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధిలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది కృషి ఎనలేనిదని ప్రశంసించారు. విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన గుణాత్మకమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు అంకిత భావంతో కృషి చేయాలని సూచించారు. ఈసందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులు, టెన్త్‌లో 10 జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో దుర్గాప్రసాద్, బంగారు నవనీత, సెక్టోరల్ అధికారి చంద్రశేఖర్, సీఎంవో శ్రీనివాస్, ఎంఈవోలు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అవకతవకలపై విచారణ!

- కమిటీ వేసేందుకు రంగం సిద్ధం చేస్తున్న ప్రభుత్వం
- తెలంగాణ వర్సిటీలో ఇప్పటికే రికార్డులు స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్
- ఏమేం కొన్నారు.. ఏమున్నాయి.. కోణంలో దర్యాప్తు
- స్టాక్ రిజిస్టర్లు లేకపోవడంపై ప్రత్యేక దృష్టి



రవీందర్‌గుప్తా కనకయ్య విద్యావర్ధిని

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ వర్సిటీలో వీసీ రవీందర్ గుప్తా, వీసీ నియమించిన ఇన్‌చార్జి రిజిస్ట్రార్లుగా పనిచేసిన కనకయ్య, విద్యావర్ధిని పాల్పడిన ఆర్థిక అవకతవకలపై ప్రభుత్వం ప్రత్యేక విచారణ కమిటీ వేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రెండుసార్లు వర్సిటీలో తనిఖీలు చేసి రికార్డులు తీసుకెళ్లారు. అదేవిధంగా ఏసీబీ సైతం అత్యంత గోప్యంగా విచారణ చేపడుతోంది. వీసీ రవీందర్, రిజిస్ట్రార్ కార్యాలయం, అకౌంట్స్, ఎస్టాబ్లిష్‌మెంట్, బిల్డింగ్ విభాగాల్లోని కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్న విషయం సంచలనంగా మారింది. పాలకమండలి తీర్మానాల నేపథ్యంలో, ఈసీ అనుమతి లేకుండా చేసిన ఆర్థిక విచ్చలవిడితనంపై పరిపాలనాపరమైన అవకతవకలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. అడ్డగోలుగా కొనుగోళ్లు, అడ్వాన్సుల చెల్లింపులతో వర్సిటీని దివాలా దిశగా తీసుకెళ్లారు. ఆయా విభాగాలకు అవసరం ఉన్నా, లేకున్నా కొనుగోళ్లతో నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఇప్పటికే 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది.

వీసీ, కనకయ్య అక్రమాలు..

■ కనకయ్య అసలు లేని నోటిఫికేషన్ ద్వారా తనకు తానుగా సీనియర్ ప్రొఫెసర్ పదోన్నతి పొందాడు. 2014 నియామకాలపై కోర్టులో స్టే ఉన్నప్పటికీ ఈ విషయాలను బేఖాతరు చేస్తూ, నిబంధనలు తుంగలో తొక్కి పదోన్నతి కల్పించుకోవడం గమనార్హం. ఇక రిజిస్ట్రార్ పదవిలో కూర్చుని వీసీతో కలిసి అనేక వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నాడు. ప్రస్తుతం ఈ అంశాలపై ఉన్నత విద్యాశాఖ ఒక కమిటీ వేస్తున్నట్లు తెలిసింది.

■ దినసరి వర్కర్ల పేరుతో చేసిన అక్రమ నియామకాలు బయటకు పొక్కుతాయని తెలిసి వర్సిటీలోని సీసీ కెమెరా ఫుటేజీలను ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. సీసీ ఫుటేజీ భద్రపరిచే డీవీఆర్ హార్డ్ డిస్క్‌లను ఇంటికి తీసుకెళ్లిన కనకయ్య ఇప్పటివరకు వర్సిటీకి అందించలేదని విశ్వసనీయంగా తెలిసింది.

■ ఇక అదే సమయంలో హై కాన్ఫిగరేషన్ కలిగిన నాలుగు ల్యాప్‌టాప్‌లను కొనుగోలు చేసిన వీసీ అప్పటి ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కనకయ్యకు ఇచ్చారు. అది ఇప్పటికీ ఆయన వద్దే ఉంది. మరో ల్యాప్‌టాప్ అప్పటి పరీక్షల నియంత్రణ అధికారికి అందజేసినట్లు సమాచారం. అది ఎక్కడుందో ఎవ్వరికీ తెలియదు. అంతకు కొద్ది రోజుల ముందే పరీక్షల విభాగం నుంచి కొత్తగా కొనుగోలు చేసిన కంప్యూటర్లలో ఒకటి మాయమైంది. ఆ విభాగానికి చెందిన పలువురు ఉద్యోగులు అక్కడే దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఒకరిపై అనుమానం వ్యక్తం చేయగా ఆ కంప్యూటర్ మరుసటిరోజే బ్రాంచ్‌కు చేరింది.

■ ప్రస్తుతం కీలక స్థానంలో ఉన్న ఒక ఆచార్యురాలు గతంలో గుట్టుచప్పుడు కాకుండా కొత్త సీలింగ్ ఫ్యాన్‌ను తన కారులో వేసుకుని వెళ్లినట్లు సమాచారం. రూ.లక్షల్లో వేతనాలు ఉన్నా రూ. 2వేలకు కక్కుర్తి పడే సిబ్బంది ఉన్న వర్సిటీలో కొన్నవి ఎన్ని, ఉన్నవి ఎన్ని అనే లెక్క దొరికేనా అనేలా పరిస్థితి తయారైంది. నాలుగు కాలేజీలు, పరిపాలనా భవనం ఉన్నప్పటికీ ఆయా కళాశాలల్లో స్టాక్ రిజిస్టర్లు నిర్వహిస్తున్న దాఖలాలు లేవు. అలాగే ఇన్‌వార్డ్, అవుట్‌వార్డ్ రిజిస్టర్లు లేవు.

■ దీర్ఘకాలంగా ప్రోగ్రామర్‌గా విధులు నిర్వహిస్తున్న ఒక వ్యక్తికి ల్యాబ్‌లో హార్డ్‌డిస్క్‌లు మాయం చేయడంలో అందెవేసిన చెయ్యిగా పేరుంది. ఇతను గతంలో ప్రిన్సిపల్ కార్యాలయానికి ఒక కంప్యూటర్ అందజేయకున్నా అందించినట్లు చూపాడు. కార్యాలయ సిబ్బంది సీసీ కెమెరా ఫుటేజ్ చూడగా, అసలు విషయం బయట పడింది. దీంతో తేలుకుట్టిన దొంగలా కంప్యూటర్ తెచ్చి ఇవ్వక తప్పలేదు.

■ కొనుగోళ్లపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆయా విభాగాల్లో కొనుగోళ్ల తీరుపై అందుబాటులో ఉన్న స్టాక్‌పై విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

■ కొనుగోళ్లు చేసే క్రమంలో నిబంధనలు ఏ మేరకు పాటించారనేది ప్రశ్నార్థకంగానే ఉంది. రూ. కోట్లు దారి మళ్లించి కొనుగోలు చేసినవి ఎన్ని? వాటిలో వర్సిటీకి చేరినవి ఎన్ని? ఇక్కడ ఉన్నవి ఎన్ని అనే విషయమై ఇప్పటికే పలు అనుమానాలున్నాయి. ఇదిలా ఉండగా కొందరు ప్రొఫెసర్ల వ్యవహారశైలి సైతం ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చుతున్నాయి. 2021 మేలో ఆచార్య రవీందర్ వీసీగా బాధ్యతలను తీసుకోగానే ఆయన పంచన చేరిన కనకయ్య తానొక్కడినే రిజిస్ట్రార్ పదవికి సమర్థుడినని, అప్పటి రిజిస్ట్రార్, పలువురు ఆచార్యులపై తప్పుడు సమాచారం అందించి కీలక పదవిలో చేరి అక్రమ నియామకాలకు తెర లేపాడు.

గొర్రెలు నచ్చలే..!

- అనంతపూర్ నుంచి 1,785 మాత్రమే తీసుకువచ్చారు
- మళ్లీ వెళ్లేందుకు చర్యలు చేపడుతున్న అధికారులు
- మందలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల కోసం అన్వేషణ
- ఇప్పటి వరకు జిల్లాలో 85 యూనిట్లే పంపిణీ



అనంతపూర్ నుంచి ఇటీవల జిల్లాకు తీసుకువచ్చిన జీవాలు

డొంకేశ్వర్(ఆర్మూర్): గొర్రెల కోసం ఏపీలోని అనంతపూర్‌కు వెళ్లిన జిల్లా అధికారులకు, లబ్ధిదారులకు చుక్కెదురైంది. అక్కడ మందలు మందకొడిగానే ఉండడంతో లబ్ధిదారులకు జీవాలు నచ్చలేదు. దీంతో బోధన్ నుంచి 18 మంది, పల్లికొండ నుంచి 16మంది మూడ్రోజుల పాటు అక్కడే ఉండి జిల్లాకు వాపస్ వచ్చారు. అనుకున్న స్థాయిలో గొర్రెలు లేకపోవడం, కొన్నిచోట్ల పెద్దగా ఉండడంతో కొనుగోలు సాధ్యపడలేదు. దీంతో జిల్లాలో జీవాల పంపిణీకి స్వల్ప బ్రేకులు పడ్డాయి. లబ్ధిదారులను మళ్లీ తీసుకెళ్లడానికి పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం మందలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల కోసం అన్వేషిస్తున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 9న గొర్రెల పంపిణీని ప్రారంభించారు. అయితే, ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న జీవాల పంపిణీ జిల్లాలో 85 యూనిట్లకే పరిమితమైంది. ఇటీవల అనంతపూర్ జిల్లాకు వెళ్లిన అధికారులు ఆపసోపాలు పడి ఇప్పటి వరకు జిల్లాకు 1,785 జీవాలను మాత్రమే తెచ్చారు. వాస్తవానికి పంపిణీ ప్రారంభం రోజున 24 యూనిట్ల చొప్పున ఐదు నియోజకవర్గాలు కలిపి మొత్తం 120 యూనిట్లను లబ్ధిదారులకు అందజేయాలి. కానీ, జీవాలను పక్క రాష్ట్రం నుంచి తెచ్చేందుకు సమయం సరిపోకపోవడంతో 85 యూనిట్లే పంపిణీ చేశారు. ఇంకా 35 యూనిట్లు గ్రౌండింగ్ చేయాల్సి ఉంది. దీనికోసం ఇటీవల అనంతపూర్‌కు వెళ్లగా, అక్కడి గొర్రెలు లబ్ధిదారులకు నచ్చలేదు. దీంతో మిగిలిన యూనిట్ల గ్రౌండింగ్ దశాబ్ది ఉత్సవాల్లో సాధ్యపడలేదు.

మిగతా వారికి ఎప్పుడో?

రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం జిల్లాకు 8,384 యూనిట్ల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పటి వరకు 1,843 మంది గొల్ల, కుర్మలు తమ వాటాధనాన్ని ప్రభుత్వానికి డీడీల రూపంలో చెల్లించారు. ప్రస్తుతం 85 మందికి మాత్రమే యూనిట్లు అందడంతో మిగతా వారు మాకెప్పుడిస్తారని అధికారులను అడుగుతున్నారు. తమను కూడా జీవాలను తెచ్చుకునేందుకు తీసుకెళ్లాలని ఒత్తిడి తెస్తున్నారు. అయితే, గొర్రెలను జిల్లాకు తేవడానికి కలెక్టర్ నియమించిన జిల్లా అధికారులు ఇటీవల అనంతపూర్‌కి వెళ్లారు. మళ్లీ తెచ్చేందుకు వారినే పంపుతారా? లేదా రాష్ట్ర శాఖ సూచించిన అధికారులు వెళ్లారా..? అనే స్పష్టత రావాల్సి ఉంది. అనంతపూర్‌తో పాటు కర్ణాటకలోని రాయచూర్ జిల్లా నుంచి జీవాలను తెచ్చేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే, రాయచూర్‌కు ఇంత వరకు జిల్లా నుంచి వెళ్లలేదు.

డీడీలు కట్టిన వారిని తీసుకెళ్తాం

గొర్రెలు నచ్చక అనంతపూర్ నుంచి కొంతమంది వాపస్ వచ్చిన విషయం వాస్తవమే. వారిని మళ్లీ తీసుకెళ్లడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు 120లో ఇంకా 35 యూనిట్లు గ్రౌండింగ్ చేయాల్సి ఉంది. డీడీలు కట్టిన మిగతా వారందరినీ కూడా జీవాలను తెచ్చేకునేందుకు తీసుకెళ్తాం. లబ్ధిదారులు ఆందోళన చెందకుండా ఓపిక పట్టాలి.

– జగన్నాథచారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి



తల్వేదలో వెలిసిన ఫ్లెక్సీ

ఎమ్మెల్యేలకు ఫ్లెక్సీల సెగ

మోపాల్/నందిపేట: ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిలకు ఫ్లెక్సీల సెగ తగిలింది. తమ గ్రామాల అభివృద్ధి ఏం చేశారంటూ ప్రశ్నిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మోపాల్ మండలం బాడ్సిలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తూ ప్రతిపక్ష పార్టీల నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం కలకలం సృష్టించింది. బాడ్సి చౌరస్తాతో పాటు స్కూల్ వద్ద ఫ్లెక్సీలు వెలిశాయి. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బాడ్సి ప్రైమరీ పాఠశాలకు బాజిరెడ్డి వస్తున్నారని సమాచారం వచ్చింది. దీంతో ప్రతిపక్ష పార్టీల నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ఒక్కసారి కూడా బాడ్సికి రాలేదని, ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదని వారు ఆరోపిస్తున్నారు. కానీ అప్పటికే ఎమ్మెల్యే పర్యటన రద్దయ్యింది.

ఆర్మూర్ మండలం తల్వేదలో..

ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తల్వేదలో పర్యటించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి వ్యతిరేకంగా గ్రామంలో ఫ్లెక్సీలు వెలియడం కలకలం రేపింది. ఇచ్చిన హామీలు మరిచి తమ గ్రామానికి ఏమి చేశారంటూ ఎందుకు వస్తున్నావు అంటూ ఫ్లెక్సీలు వెలిశాయి. ఫ్లెక్సీలో ఏడు ప్రధాన డిమాండ్లను ప్రస్తావించారు.



బాడ్సీ గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

క్లుప్తంగా

2న పద్మశాలి విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా నగర పద్మశాలి సంఘం, పద్మశాలి ఆత్మీయ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందిన పద్మశాలి విద్యార్థులకు జులై 2న ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నట్లు జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు దీకొండ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని న్యూఅంబేడ్కర్ భవన్‌లో జులై 2న మధ్యాహ్నం 3గంటలకు పురస్కారాలు అందజేస్తామన్నారు. అర్హులైన విద్యార్థులు 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ చదివిన పద్మశాలి విద్యా ర్థుల మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, కులధృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో ఈనెల 25 లోగా సంఘ బాధ్యులకు అందజేయలన్నారు. సంఘ బాధ్యులు పుల్గం హన్మాండ్లు–93964 83999, వెంకట నర్సయ్య–9985566374, రాపెల్లి గురుచరణం–9866557115, గుడ్ల భూమేష్–9494258585కు విద్యార్థులు సంబంధిత పత్రాలను అందజేయలన్నారు.

క్రీడాకారులకు సన్మానం

రుద్రూర్: ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మోస్రా మండలం గోవూర్ హైస్కూల్ విద్యార్థులు ప్రత్యూష, మధుర, దీక్షిత ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఎస్‌ఎంసీ చైర్మన్ నన్నేసాబ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా మంగళవారం పాఠశాల విద్యా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులకు చదువుతోపాటు ఆత్మరక్షణ కోసం కరాటే లాంటి శిక్షణ అవసరమని అన్నారు. హెచ్‌ఎం రవీందర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసుల్లో రాజకీయ బదిలీలు

- ప్రజాప్రతినిధుల మధ్య సఖ్యత లేకపోవడంతో సిబ్బందికి ఇబ్బందులు
- ఫిబ్రవరి నుంచి కొనసాగుతున్న బదిలీల ప్రక్రియ



ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లాలో పోలీసుల బదిలీలకు రాజకీయ రంగు పట్టుకుంది. జిల్లాలో ప్రజాప్రతినిధుల మధ్య సఖ్యత లేకపోవడంతో పోలీసులకు తలనొప్పిగా మారింది. నియోజకవర్గం ప్రజాప్రతినిధి అనుగ్రహం ఉన్నా, బదిలీ ఎప్పుడు జరుగుతుందోనని ఎస్సైలు, సీఐలు ఆందోళన చెందుతున్నారు. ఫిబ్రవరిలో నిజామాబాద్ ఏసీపీగా పని చేసిన వెంకటేశ్వర్ రెండేళ్లు కాకుండానే బదిలీపై వెళ్లడంతో అప్పుడు పోలీస్‌వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధులు ఇచ్చిన సిఫార్సు లేఖలతో వచ్చినా పూర్తికాలం పని చేస్తామా లేదా అనే సందేహాలు ఉన్నాయి. గత కొంతకాలంగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైలు, సీఐలు, ఏసీపీల బదిలీలు పరంపర కొనసాగుతునే ఉన్నాయి. పోలీస్‌శాఖలో రాజకీయరంగు పులుమడంతో జిల్లాలో పోలీసులకు గుర్తింపు లేకుండాపోతుంది. జిల్లా పోలీస్‌శాఖలో ఎస్సైలు, సీఐలను కొందరు ప్రజాప్రతినిధులు తమకు నచ్చిన ప్రాంతాలకు బదిలీ చేసుకునేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. కమిషనరేట్ పరిధిలో ఎన్నికల బదిలీలు ఉండగా జిల్లాకు కొన్ని రోజుల క్రితం వచ్చిన సీఐలు బదిలీలు కావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ప్రజాప్రతినిధిని కలిస్తే చాలు..

జిల్లాలో ప్రజాప్రతినిధుల మధ్య సఖ్యత లేకపోవడంతో బదిలీల ప్రక్రియ కొనసాగుతుంది. ప్రజాప్రతినిధులు జరిగే కార్యక్రమాలకు పోలీసులు భద్రత కల్పించాల్సి ఉంటుంది. దీంతో పోలీసులు తమ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులకు కాకుండా వేరే నియోజకవర్గ ప్రతినిధిని కలిస్తే చాలు ఆ పోలీస్ అధికారి పోస్టు ఉంటుందా? ఊడుతుందా? అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తాజాగా ఇలాంటి ఘటన నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న పోలీస్ అధికారికి చోటుచేసుకుంది. సదరు అధికారికి పోస్టింగ్ ఉత్తర్వులు వచ్చే వరకు తెలియకపోవడం శోచనీయం. ఈ పోలీస్ అధికారి పరిధిలో మూడు ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు ఉంటారు. ఓ కార్యక్రమంలో సదరు ప్రజాప్రతినిధి వచ్చిన సమయంలో భద్రత కల్పించడంతో వారం తర్వాత బదిలీ వెలువడటం కొసమెరుపు. ఈక్రమంలో ఫిబ్రవరి నుంచి ఏసీపీతోపాటు సీఐ పలువురు బదిలీ అయ్యారు.

ఎన్నికల కోసమే..

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో పోలీసుశాఖలో బదిలీలు జరుగుతాయనే చర్చ జరుగుతుంది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తమకు అనుకూలంగా ఉన్నవారి కోసం పోస్టింగ్ తెచ్చుకునేందుకు ప్రజాప్రతినిధులు పావులు కదుపుతున్నారు. ప్రజాప్రతినిధుల మధ్య సఖ్యత లేకపోవడం, తమకు సహకరించడం లేదనే సాకుతో బదిలీలు చేయడం జిల్లాలో కొనసాగుతునే ఉంది. కానీ పోలీస్‌శాఖ బదిలీల్లో రాజకీయ నేతలు జోక్యం చేసుకోవడంతో పోలీసులు పనిచేయడంలో ఆసక్తి తగ్గినట్లు తెలుస్తోంది. జిల్లాలో ఇప్పటికే జిల్లా పోలీస్‌కమిషనర్ పోస్టు ఖాళీగా ఉంది. ఈక్రమంలో వచ్చే నెలలో పోలీస్‌శాఖలో బదిలీలు జరుగుతాయనే చర్చ కొనసాగుతోంది.

జుక్కల్ నియోజకవర్గానికి రూ.32 కోట్ల నిధులు

- రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్‌కు వినియోగం
- ఎమ్మెల్యే హన్మంత్‌సింధే



మద్నూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మద్నూర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్, జుక్కల్, పెద్ద కొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్ ఐదు మండలాలకు రూ.32 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే హన్మంత్‌సింధే వెల్లడించారు. ఆయా మండలాల్లో నిధులను రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ కోసం వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి రూ.335 కోట్లు మంజూరు చేశారని అన్నారు.

అతి త్వరలో డిగ్రీ కళాశాల..

మద్నూర్ మండల విద్యార్థులు, ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అతి త్వరలో రాబోతుందని, దీంతో విద్యార్థుల కళ నెరవేరుతుందని ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. మద్నూర్‌లో డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరు కోసం తీవ్రంగా కృషి చేసినట్లు ఆయన అన్నారు. ఆలస్యం లేకుండా మండలానికి డిగ్రీ కళాశాల మంజూరు ఉత్తర్వులు త్వరలో వస్తాయని పేర్కొన్నారు. సెంట్రల్ లైటింగ్ మంజూరుతో బీఆర్‌ఎస్ నాయకులు టపాసులు కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేను స్థానిక ప్రజాప్రతినిధులు సన్మానించారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు సురేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బస్వీపటేల్, ఆత్మకమిటీ చైర్మన్ గంగాధర్, ఉప సర్పంచ్ విఠల్, నాయకులు కంచిన్ హన్మండ్లు, పాకాల విజయ్, కుషాల్ తదితరులు ఉన్నారు.

ముగిసిన దరఖాస్తుల గడువు

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులవృత్తులకు అందించే ఆర్థికసాయానికి సంబంధించిన దరఖాస్తుల గడువు ముగిసింది. బీసీ కులవృత్తుదారులను ఆదుకోవడానికి గత కొన్ని రోజుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తుండగా, మంగళవారంతో గడువు ముగిసింది. చివరిరోజు దరఖాస్తుదారులు పెద్దసంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మొత్తం 23,463 దరఖాస్తులు వచ్చినట్లు సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు. రాత్రి 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తు వివరాలను బీసీ సంక్షేమ శాఖ అధికారులు నమోదు చేసుకున్నారు.

ఘనంగా పూరి జగన్నాథయాత్ర



జగన్నాథయాత్రలో పాల్గొన్న భక్తులు

నిజామాబాద్ సిటీ: నగరంలో మంగళవారం ఇ స్కాన్ ఆధ్వర్యంలో పూరిజగన్నాథ యాత్రను ఘనంగా నిర్వహించారు. మంగళవారం నగరానికి చేరుకున్న యాత్రను వినాయక్‌నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ప్రారంభించారు. యాత్ర నగరంలోని పూలాంగ్ చౌరస్తా మీదుగా కొనసాగి దుబ్బాలోని మహేశ్వ రీ భవన్‌కు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు కొనసాగాయి. మేయర్ నీతూకిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ మల్లేష్, నాయకులు సు జిత్‌సింగ్, శ్రీనివాస్, సత్యప్రకాష్ పాల్గొన్నారు.



జగన్నాథుడి రథం

జిల్లాకు చుక్క నీరైనా ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం

- గుత్ప, అలీసాగర్ పథకాలు కాంగ్రెస్‌వే
- రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి



మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి.. పక్కన ముప్పగంగారెడ్డి, ఆదిరెడ్డి, తాహెర్‌బిన్‌హందాన్

ఖలీల్‌వాడి: తొమ్మిది ఏళ్లలో సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు చుక్కనీరు అందించలేదని రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ కమిటీ, మండల అధ్యక్షులను ప్రకటిస్తూ నియామక పత్రాలు అందించారు. అనంతరం అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాకు సాగు నీరు అందించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. 21 ప్యాకేజీ ద్వారా గ్రావిటీ ద్వారా సాగు నీరు అందించే అవకాశం ఉన్నా, కమీషన్ల కోసం పైపు లైన్ ఏర్పాటు చేసి, ఇంత వరకు సాగునీరు అందించలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకం నిర్మించామన్నారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో సాగునీటిపై రైతులతో సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో తరుగు పేరు మీద దోపిడీ జరిగితే మంత్రి, ఎమ్మెల్యేలు మౌనంగా ఉన్నారని, ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. అకాల వర్షాలతో పంట నష్టపోయినా ఇంత వరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిహారం అందించలేదన్నారు. రైతులకు ఇంతవరకు రుణమాఫీ చేయలేదన్నారు. ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో కిసాన్ కాంగ్రెస్ నాయకులు ప్రజల వద్దకు వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు చేసిన మోసాలను వివరించాలన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేసే పనులను రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని తెలిపారు. భూమిలేని ఉపాధి హామీ కూలీలకు రూ.12వేలు ప్రతియేటా అందిస్తామన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్, జిల్లా కిసాన్ సెల్ ఇన్‌ఛార్జి ఆదిరెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



తెయూ రిజిస్ట్రార్ యాదగిరికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ ప్రతినిధులు

తెయూ(డిచ్‌పల్లి): నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెస ర్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వేణురాజ్ మాట్లాడుతూ.. బోధన్‌లోని సెయింట్ థామస్, శ్రీచైతన్య, మల్లారంలోని అయే షా, ఆర్మూర్‌లోని ప్రియదర్శిని బీఈడీ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయన్నారు. ఎన్‌సీటీఈ నిబంధనల మేరకు ఉండాల్సిన మౌలిక వసతులు ఏ ఒక్క కళాశాలలో లేవన్నారు. అలాగే యూనివర్సిటీ అనుమతించిన సీట్ల పరిమి తి కంటే అధిక సంఖ్యలో సీట్లు భర్తీ చేస్తున్నారని, విద్యాప్రమాణాలు పాటించకుండా కేవలం ధనార్జనే ధ్యేయంగా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు అష్రఫ్, నిఖిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల ర్యాలీ



సౌత్‌క్యాంపస్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

భిక్కనూరు: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తమ ఉద్యోగాలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లోని యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేశారన్నారు. కానీ మన రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో 1300 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారని, వారిని ఇంత వరకు రెగ్యులరైజ్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నారాయణగుప్త, ప్రతినిధులు యాలాద్రి, నర్సయ్య, రమాదేవి, వైశాలి, సునీత, శ్రీమాత, దిలీప్ పాల్గొన్నారు.

తెయూలో..

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం క్యాంపస్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఎదుట వారు ధర్నా నిర్వహించారు.

రేపు జిల్లాస్థాయి క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మోడల్ స్కూల్ మైదానంలో ఈ నెల 22న జిల్లా స్థాయి క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్ మైదానంలో సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించే ఎంపిక పోటీలకు క్రీడాకారులు సొంత క్రికెట్ కిట్, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు, డ్రెస్‌కోడ్‌తో హాజరు కావాలని అసోసియేషన్ ప్రతినిధులు సూచించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి అండర్ –19, అండర్–25 క్రికెట్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వారు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్‌నెం: 83175 95377ను సంప్రదించాలని సూచించారు.

రెండోరోజు కొనసాగిన మహా చండీయాగం



నిజామాబాద్ సిటీ: నగరంలోని బస్వాగార్డెన్‌లో మంగళవారం రెండోరోజు మహా చండీయాగం కొనసాగింది. యాగంలో జిల్లా జడ్జి సునీత కుంచాల పాల్గొనగా, నిర్వాహకులు సంతోష్‌శర్మ జడ్జికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణ వ్రతం చేశారు. యాగంలో పాల్గొనటం తనకు ఎంతో సంతృప్తినిచ్చినట్లు జడ్జి పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. రేపు మధ్యాహ్నం పూర్ణాహుతి కార్యక్రమంతో చండీయాగం కార్యక్రమం ముగుస్తుందని సంతోష్‌శర్మ తెలిపారు.

కొనసాగుతున్న వెరిఫికేషన్



అభ్యర్థుల వివరాలను నమోదు చేస్తున్న పోలీసు సిబ్బంది

ఖలీల్‌వాడి: తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహిస్తున్న ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికేషన్ వెరిఫికేషన్ ఆరో రోజు మంగళవారం కొనసాగింది. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఇన్‌చార్జి పోలీస్ కమీషనర్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు డీసీపీ (ఏఆర్) గిరిరాజు ఆధ్వర్యంలో సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిర్వహించారు. 608 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, అందులో 536 హాజరు కాగ, 72 మంది గైర్హాజరయ్యారు. ఏవో శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు శంకర్, హైమద్, తదితరులు ఉన్నారు.

ఓపెన్ ప్లాట్ విక్రయించిన వ్యక్తిపై కేసు నమోదు

కామారెడ్డి క్రైం/కామారెడ్డి టౌన్: వెంచర్ చేసినప్పుడు ప్రభుత్వ అవసరాలకు వదిలేసిన ఓపెన్ ప్లాట్‌ను అక్రమంగా విక్రయించిన ఓ వ్యక్తిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన ఎండి ఇస్మాయిల్ కామారెడ్డిలోని గాంధీనగర్‌లో చేసిన ఓ వెంచర్‌లో 500 గజాల ప్లాటు ను 2019లో కామారెడ్డి పట్టణానికి చెందిన మహమ్మద్ సబ్బార్ వద్ద కొనుగోలు చేశాడు. ఇటీవల ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం మున్సిపల్ వారిని సంప్రదించగా సదరు ప్లా టు వెంచర్‌లో భాగంగా మున్సిపల్‌కు వదిలేసిన ఓపెన్ స్థలం అని చెప్పారు. దీంతో వెంచర్ యజమానిని ప్రశ్నించగా మరో ప్లాటు ఇప్పిస్తానని కొద్ది రోజులుగా మాయ మాటలు చెప్పి మోసం చేస్తున్నాడని బాధితుడు మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌ఓ నరేష్ తెలిపారు.

క్రైం కార్నర్

గంజాయి పట్టివేత



నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ నుంచి పిప్రి వెళ్లే మార్గంలో మంగళవారం సునీల్ రోహిదాస్ వాకుడే అనే వ్యక్తి నుంచి గంజాయి పట్టుకున్నట్లు ఆర్మూర్ ఎక్సైజ్ సీఐ స్టీఫెన్‌సన్ తెలిపారు. సునీల్ పల్సర్ బైక్‌పై 156 గ్రాములు గంజాయి తీసుకువెళుతుండగా, గస్తీ నిర్వహిస్తున్న సమయంలో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. కాగ గంజాయిని, బైక్ స్వాధీనం చేసుకొని అతడిని కోర్టులో హాజరుపర్చామన్నారు. గంజాయి అమ్మినా, కొన్న, సేవించిన, నిల్వ ఉంచిన ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం నేరమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి పట్టివేతలో ఎక్సైజ్ ఎస్సైలు గంగాధర్, ప్రమోద్, చైతన్య, చంద్రమౌళి, సిబ్బంది గంగాధర్‌గౌడ్, నారాయణ, ధర్మేంధర్, సాయిబాబా, మోహన్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

భర్త తన మాట వినడం లేదని ఆత్మహత్య



రేవతి (ఫైల్)

బాల్కొండ: భర్త తన మాట వినడం లేదని మనస్తాపం చెంది భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ముప్కాల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై భాస్కరచారి తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన పస్నీరు రేవతి(37), కిషన్ దంపతులు. సోమవారం కిషన్ తన చెల్లికి రూ.2వేలు పంపడంతో, భర్తతో భార్య గొడవ పడింది. భర్త తన మాట వినకుండ డబ్బులు పంపుతున్నాడని ఆమె మనస్తాపం చెందింది. ఈక్రమంలో మంగళవారం ఉదయం భర్త కిషన్, చిన్నకుమారుడు అభినవ్ వాకింగ్‌కు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో ఉన్న పెద్ద కుమారుడు అభినయ్ నిద్రలేచి చూసేసరికి తల్లి ఉరి వేసుకుంది. అతడు తన బాబాయ్ సహయంతో తల్లిని కిందకు దించి వెంటనే బాల్కొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని అక్కడి వైద్యులు సూచించడంతో పెర్కిట్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందింది. మృతురాలి తండ్రి కమ్మం ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాల్కొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఒంటరితనం భరించలేక యువకుడు..



సరోజ్ కుమార్ మృతదేహం

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని ఓ రైస్ మిల్లులో లేబర్‌గా పని చేస్తున్న ఓ యువకుడు ఒంటరితనం భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీధర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండంలోని గోపన్‌పల్లి గ్రామంలోని వెంకటసాయి రైస్‌మిల్లులో గత కొంతకాలంగా బీహార్‌కు చెందిన యువకుడు సరోజ్ కుమార్ (20) లేబర్‌గా పనిచేస్తుండేవాడు. గత కొన్ని రోజుల నుంచి అతను ఇంటికి దూరంగా ఉన్నానని బాధపడుతూ, తరచూ బీహార్ రాష్ట్రానికి చెందిన ఒక అమ్మాయితో ఫోన్ మాట్లాడుతూ ఉండేవాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి రైస్‌మిల్‌లో లేబర్లందరూ భోజనం ముగించుకుని నిద్రిస్తున్న సమయంలో సరోజ్ కుమార్ ఒక తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒంటరితనంతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి అన్న దిలీప్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఏఎస్సై గంగారాం తెలిపిన వివరాలు ఇలా.. మండలకేంద్రంలోని దుర్గా నగర్‌కు చెందిన దర్పు శ్రీనివాస్(38) వారంరోజుల పాటు భార్య, పిల్లలతో కలిసి అత్తవారింటికి వెళ్లాడు. మూడు రోజుల క్రితం భార్య పిల్లలను అక్కడే ఉంచి ఒక్కడే గాంధారికి తిరిగి వాచ్చాడు. సోమవారం రాత్రి ఆర్థిక ఇబ్బందులు కారణంగా సొంతింట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం కాలనీవాసులు గమనించి బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. కాగా మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

పరీక్షలు సరిగా రాయలేదని విద్యార్థి..



మహేష్ (ఫైల్)

ఖలీల్‌వాడి: డిగ్రీ పరీక్షలు సరిగా రాయలేదని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలో మంగళవారం చోటుచేసుకుంది. మూడో టౌన్ ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని పంబోలి కాలనీకి చెందిన మహేష్(20) ఓ ప్రయివేట్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. ఈక్రమంలో ఇటీవల నిర్వహించిన పరీక్షలను మహేష్ సరిగా రాయలేదు. దీంతో మంగళవారం అతడు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈమేరకు మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.